క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ గులాబీతోట ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపులేటివారి వీధి, బాలాజీ వీధి, నేతాజీ వీధి, సాయిప్రసన్న వీధి, సాయిబాబా వీధి, కూనపరెడ్డి వీధి, మోహన్‌గాంధీ వీధి, గణపతి వీధి, గరిమెళ్లవారి వీధి, కునపరెడ్డి సుబ్బానాయుడు వీధి, బొమ్మసాని నారాయణ వీధి, కాకర్లమూడివారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బాబావారి 106వ పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం బాబావారి 106వ పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. లోక కల్యాణార్థం సాయినాథ–దుర్గా హోమం వేద పండితులచే శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షిర్డీ సాయినాథుడు, దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం బాబావారి పుణ్యతిథి మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది.

మురుగు తొలగింపునకు చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావుబుచ్చయ్యకాలనీలో మురుగు, వర్షపునీరు తొలగించేందుకు శుక్రవారం పారిశుద్ధ్య విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ మురుగునీరు బయటకు పోయే మార్గం లేదు. దీంతో ఇక్కడ మురుగు, వర్షపునీరు నిలిచిపోయి స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి 'మురుగు పోయే దారేదీ' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్‌రావు, వార్డు శానిటరీ సెక్రటరీ సుధీర్, మేస్త్రి శ్రీను నాలామేన్ సహాయంతో గాడి తీసి నీరు బయటకు పోయేందుకు తాత్కాలికంగా పనులు చేశారు.

ఈ సందర్భంగా వారు త్వరలోనే మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వేదమాతా.. నమోస్తుతే..



శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా అమ్మవారు



మధురానగర్ మెయిన్ రోడ్డులో గాయత్రీ దేవి అలంకరణలో..



గాయత్రీదేవిగా అంకమ్మతల్లి శక్తిపీఠంలోని అమ్మవారు



జీవీఆర్‌నగర్‌లో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో..

- శ్రీగాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

విజయవాడ కల్చరల్: శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను రెండో రోజైన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దసరా నవరాత్రుల్లో భాగంగా వేద మాత గాయత్రీదేవి అలంకరణలో లోకమాత దర్శనమిచ్చింది. లబ్బీపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కంచి కామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆశ్వయుజ శుద్ధ విజయ శుక్రవారం పార్వతీదేవిని అర్చక స్వాములు గాయత్రీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు చతుర్వేదాలను పారాయణం చేశారు. అలాగే శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన నిర్వహించారు.

శివరామకృష్ణ క్షేత్రంలో..

శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని ముగురమ్మలు శక్తి రూపిణి, గాయత్రీమాత, హంస వాహన భ్రమర వాసినిగా పూజలందుకున్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామికి ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ పూజలు నిర్వహించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శివకామేశ్వరీ అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు.

రామలింగేశ్వరపేటలో...

రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, సభ్యులు పర్యవేక్షించారు. అలాగే స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

గద్దే వెంకట్రామయ్యనగర్‌లో...

గద్దే వెంకట్రామయ్యనగర్‌లో దేవుని మండపం వద్ద భక్తబృందం ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకారం చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజించారు. అలాగే మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'ధర'ఖాస్తులతో దండుకుంటున్న దళారులు

అప్లికేషన్‌కు రూ. 30, పూర్తి చేసినందుకు రూ. 30లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో సర్వస్వం కోల్పోయిన బాధితులు తమకు పరిహారం అందలేదని నిత్యం వేలాది మంది కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. పరిహారం కోసం దరఖాస్తు చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్‌లోనే బాధితులకు ఉచితంగా అప్లికేషన్స్ అందజేశారు. ఈ విషయం తెలియని కొందరు ఆ రెండు రోజుల్లోనే బయట వ్యక్తుల నుంచి దరఖాస్తులు కొనుగోలు చేశారు. ఆ తర్వాత నుంచి కలెక్టరేట్‌లో దరఖాస్తులు ఉచితంగా ఇవ్వడం మానేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు దళారులు కలెక్టరేట్ పరిసరాలకు చేరారు. దరఖాస్తుకు ధర నిర్ణయించారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 30వరకు వసూలు చేస్తున్నారు. ఇక అప్లికేషన్ పూర్తి చేసేందుకు వారి నుంచి మరో రూ. 30వసూలు చేస్తున్నారు. వరద బాధితుల అవసరాన్ని దళారులు ఈ విధంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇక చదువు రానివారి విషయంలో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వచ్చిన వారి నుంచి వచ్చినంత గుంజుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో బాధితులు వారు చెప్పినంత ఇచ్చి దరఖాస్తులు కొనుగోలు చేస్తున్నారు. అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక తదితర ప్రాంతాల నుంచి రోజువారీ కూలీ పనులు మానుకొని కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఇక్కడకు వచ్చేందుకు ఆటో చార్జీల కింద రూ. వందల్లో ఖర్చు చేస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చిన తర్వాత దరఖాస్తులకు ధర నిర్ణయించి దండుకుంటున్నారు. కలెక్టరేట్‌లోనే ఉచితంగా దరఖాస్తులు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విజేతలతో కళాశాల సిబ్బంది



దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్స్ అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, ఓపెన్ హౌస్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అధ్యాపకులు కేవీ శాంతకుమారి, వీ అరుణకుమారి, ఏ భాను ప్రసాద్, యూ రమణమూర్తి, కే రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో ఎన్‌సీసీకి అనుమతి

ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ అనుమతి లభించింది. గతంలో ఎన్‌సీసీ విభాగానికి నిర్వహణ అధికారులు లేకపోవడంతో ఇక్కడి నుంచి ఎన్‌సీసీని తొలగించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, అధ్యాపకుడు ఎం. మల్యాద్రి కృషితో తిరిగి ఎన్‌సీసీని కళాశాలకు మంజూరు చేశారు. అయితే గతంలో ఉన్న ఆర్మీ విభాగం కాకుండా ఇప్పుడు వైమానిక దళశాఖకు కూడా అనుమతి లభించింది. ఈ మేరకు 2024–25 విద్యాసంవత్సరానికి ఎన్‌సీసీలో చేరేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో శుక్రవారం ఎయిర్‌పోర్స్ అధికారులు కళాశాలకు చేరుకుని విద్యార్థులకు రాత, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 69 మంది విద్యార్థులు పాల్గొన్నారు

వరద బాధితులకు ఆపన్న హస్తం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపునకు గురైన విద్యార్థులకు సింగ్‌నగర్ శ్రీచైతన్య స్కూల్‌లో శుక్రవారం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీచైతన్య స్కూల్స్ ఈజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ వరదలకు విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలను కోల్పోవడంతో గందరగోళ పరిస్థితుల్లోకి వెళ్లిపోయారని, వారికి మరల చదువుపై ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి విద్యార్థికి అన్ని పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్ఐ నరేంద్ర, అకాడమిక్ కోఆర్డినేటర్ జె. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సుమాకిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్లు, వస్త్రాల పంపిణీ

వరద బాధితులకు నరసరావుపేటలోని మేరీ కుర్జ్ మెమోరియల్ సెంటినరీ టోవెన్ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, నూతన వస్త్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. రెవ.మున్నంగ్ ఎలీషా చేతులమీదుగా సింగ్‌నగర్, ఇమ్మానుయేల్ బాప్టిస్ట్ చర్చ్, తెలుగు బాప్టిస్ట్ చర్చిల్లో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవళ్లు అందజేయడంతో పాటు పాస్టర్లకు ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున సాయం చేశారు. సెంటినరీ చర్చ్ కమిటీ అధ్యక్షుడు బొమ్ము బాబురావు, సెక్రటరీ డేనియల్, కోశాధికారి జాన్ జ్యోతి, సభ్యులు కొనంకి బాబు, బాజీ, పాస్టర్ మంగళపూడి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఈజీఎం మురళీకృష్ణ

రాజధానిలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



మహాసభల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుల విగ్రహాలను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఆల్ ఇండియా ఘంటసాల వెంకటేశ్వరరావు చైతన్యవేదిక, రాగలహరి, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం సాంస్కృతిక సంస్థల తొలి సమావేశం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని టాంక్‌బండ్ మీద అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారని అదే స్ఫూర్తితో అమరావతిలోనూ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.

చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సినీ రంగానికి చెందిన ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎన్టీ రామారావుకు భారత రత్న కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. 13వ రాష్ట్ర చైతన్య మహాసభలను త్వరలో నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల బ్యానర్‌ను అతిథులు ఆవిష్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతరాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో మీరాకుమార్, ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీ, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు ముప్పును జాతీయ విపత్తుగా పరిగణించాలి



వరద బాధితులతో కలిసి సింగ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముప్పును జాతీయ విపత్తుగా పరిగణించి న్యాయం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. వరద బాధితులకు పూర్తిస్థాయి ఎన్యూమరేషన్ చేయాలని కోరుతూ సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లోని హోచిమిన్ భవన్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాధితులకు సాయం చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే బుడమేరు ముంపు జరిగిందని విమర్శించారు. బుడమేరులో ఆక్రమణలు తొలగించి, బుడమేరు కాలువను పటిష్ట పరచాలని సూచించారు. నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు మాట్లాడుతూ అక్టోబర్ 5వ తేదీ కల్లా వరద బాధితులందరికీ ఆర్థిక సాయం అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకూ చాలామంది బాధితుల బ్యాంకు ఖాతాలో డబ్బులు వేయలేదని, ఇంకా ఎన్యూమరేషన్‌లో అనేకమంది పేర్లు నమోదు కాలేదన్నారు. నిజమైన బాధితులంతా సాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారని, వారి పేర్లు నమోదు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు మాట్లాడుతూ ఆధార్ లింకు కానటువంటి వారికి బ్యాంకు అకౌంట్‌లకు డబ్బులు పడకపోవడంతో వారు ఎవరిని సంప్రదించాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఇబ్బందులు తొలగించేందుకు అధికారులు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ప్రజల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బత్తుల శివకుమార్, నత్తా లక్ష్మీనారాయణ, భాష, కంది ఆదినారాయణ, గురునాథం, బ్రహ్మాజీ, పగిడిపల్లి నాగరాజు, వినయ్, కన్నమ్మ, నాగూర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్యూలైన్‌లో నీటి ప్యాకెట్లు అందించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



టెలీ కాన్ఫరెన్స్‌లో వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): ఉత్సవాలకు వచ్చే భక్తులు దాహార్తితో ఇబ్బంది పడకూడదని, వారికి క్యూ లైన్లలోనే తాగునీటి ప్యాకెట్లు అందించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి దసరా ఉత్సవాల విధుల్లో ఉన్న క్షేత్రస్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎవరికి కేటాయించిన పాయింట్‌లో ఉన్న ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. తాగు నీటి పాయింట్లు ఎప్పటికప్పుడు స్టాక్‌ని నిల్వ ఉంచుకోవాలని, గంటగంటకు స్టాక్ నివేదికను అందించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

శివకామేశ్వరీ సేవలో ఎంపీ బాబూరావు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు అందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాజ్యసభ ఎంపీ గొల్లబాబూరావు అన్నారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో ఎంతో మహిమాన్వితమైన శివకామేశ్వరీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్‌ను అభినందించారు. అనంతరం బాబూరావును పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, గొల్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వేదమాతా నమోస్తుతే



మహామండపం వద్ద అమ్మవారికి నమస్కరిస్తున్న భక్తులు



దుర్గగుడిలో మహామండపం వద్ద కుంకుమ పూజలో భక్తులు

జయహో జగజ్జనని

జయహో జగజ్జనని అంటూ భక్తులు వేదమాతను స్మరించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం గాయత్రీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకొని భక్తి పరవశం పొందారు. క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి. ముగురమ్మల మూలపుటమ్మకు కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి అర్చకులు హారతులు ఇచ్చారు. భక్తులు క్యూలో వెళ్లి అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రికి అమ్మవారి నగరోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు పులకించిన మదితో ఇళ్లకు వెనుతిరిగారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



వృద్ధురాలిని దర్శనానికి తీసుకెళ్తున్న పోలీస్



కొండపై మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

■ నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్లు నిలుపుదల

ఆటోనగర్(విజయవాడ తూర్పు): ఏపీఎస్ ఆర్టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్ ఆధునీకరణ పనుల నిమిత్తం శని, ఆదివారాల్లో పని చేయదని ఆటోనగర్ డిపో మేనేజర్ కె. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు సీజన్ పాస్‌లు తీసుకునే కౌంటర్లు పని చేయవని పేర్కొన్నారు. 7వ తేదీ నుంచి కౌంటర్లు మళ్లీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు.